నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | VIKARABAD

సీపీఆర్ చేసి.. ప్రాణం నిలిపి..

లంగర్‌హౌస్ ఠాణా పరిధిలో గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో విధులకు వెళ్తున్న సంతోష్ అనే కానిస్టేబుల్ ఫ్లోర్‌మిల్ వద్ద గుండెపోటుతో కింద పడిపోయాడు. సమాచారం అందుకున్న లంగర్‌హౌస్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కానిస్టేబుల్ నరేశ్ సంతోష్‌కు సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడారు. అనంతరం అతడిని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా, సమయానికి సీపీఆర్ అందించడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు కానిస్టేబుల్ నరేశ్‌ను అభినందించారు.

-మెహిదీపట్నం, ఫిబ్రవరి 20

సర్వర్ డౌన్..

నత్తనడకన రెవెన్యూ సేవలు

- వికారాబాద్ జిల్లాలో పెండింగ్‌లో పదివేల సమస్యలు
- రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి ఎదురుచూపులు
- గత నెలరోజులుగా అన్నదాతల అవస్థలు

సర్వర్ డౌన్‌తో జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్లతోపాటు రెవెన్యూ సమస్యల పరిష్కారం నత్తనడకన సాగుతున్నది. గత నెల రోజులుగా సాంకేతిక సమస్యలతో దాదాపుగా పది వేల వరకు రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాక పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అన్నదాతలు తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

వికారాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): సాంకేతిక సమస్యలతో అన్నదాతలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత నెల రోజులుగా సర్వర్‌లో సమస్య తలెత్తడంతో భూముల రిజిస్ట్రేషన్లతోపాటు రెవెన్యూ సమస్యల పరిష్కారం జిల్లాలో నత్తనడకన సాగుతున్నది. దీంతో రైతులు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో వినతిపత్రాలను అందించడంతోపాటు స్థానిక రెవెన్యూ అధికారులకూ విజ్ఞప్తులు చేస్తున్నారు. పెళ్లిళ్లు, అనారోగ్య పరిస్థితులు, ఇతర అత్యవసర పరిస్థితుల నిమిత్తం భూముల విక్రయాలకు సిద్ధమవుతున్న రైతులు గత నెలరోజులుగా సర్వర్ డౌన్ సమస్యతో గంటల తరబడి తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం కొంతమేర సమస్య పరిష్కారమైందని సంబంధిత అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు ఇంకా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

పెండింగ్‌లో 10,000 రెవెన్యూ సమస్యలు

జిల్లాలో గత నెల రోజులుగా సర్వన్ డౌన్ సమస్యతో రెవెన్యూ సమస్యలు పెరిగిపోయాయి. అవి దాదాపుగా పది వేల వరకు ఉన్నాయి. దీంతో వాటి పరిష్కారానికి అన్నదాతలు తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. త్వరగానే పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నా ఇప్పటివరకు పది శాతం కూడా పూర్తికాకపోవడం గమనార్హం. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో అత్యధికంగా కలెక్టర్‌తోపాటు తహసీల్దార్ల లాగిన్‌లోనివే కావడంతో.. రైతన్నలు ప్రతి సోమవారం కలెక్టర్‌లో జరిగే ప్రజావాణిలో విన్నవిస్తున్నారు. మరోవైపు పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల్లో అధికంగా టీఎం-33(డేటా కరెక్షన్) దరఖాస్తులే ఉన్నాయి. టీఎం-33 అనంతరం ఆర్ఎస్ఆర్ సమస్యతో మ్యుటేషన్, సక్సేషన్ తదితర ఏ మ్యాడ్యూల్‌లోనూ దరఖాస్తు చేసుకున్నా అధికారులు తిరస్కరిస్తున్నారు. అయితే ఆర్ఎస్ఆర్ సమస్య పరిష్కారానికి ఎలాంటి ఆప్షన్ లేకపోవడంతో వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రైతులకు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ల రిపోర్టు కీలకంగా మారింది. ఇదే అదునుగా భావిస్తున్న జిల్లాలోని పలువురు తహసీల్దార్లు రిపోర్టులు పంపించడంలో అవినీతికి పాల్పడుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతున్నది. కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కై వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దరఖాస్తులు సక్రమంగా ఉన్నా వారు అడిగినంత డబ్బు ఇవ్వకుంటే పలువురు తహసీల్దార్లు ఏదో ఒక కొర్రీ పెడుతూ రిజెక్టు అయ్యేలా ఉన్నతాధికారులకు రిపోర్టులు పంపిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. తహసీల్దార్ల అక్రమ ఆర్జనపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల ఓ రైతు తన పేరు తప్పుగా ఎంట్రీ కావడంతో టీఎం-33 కింద దరఖాస్తు చేసుకోగా.. ఆ మండలానికి చెందిన రెవెన్యూ అధికారి డబ్బులు డిమాండ్ చేయగా.. సదరు రైతు ఇవ్వకపోవడంతో ఆ అధికారి ఉన్నతాధికారులకు కొర్రీలు పెడుతూ రిపోర్టును పంపించడంతో అది రిజెక్టు అయ్యింది. దీంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి అతడికి వచ్చింది.

సిబ్బందితో కుమ్మక్కై వసూళ్లు..!

ఉన్న భూమి కంటే ఎక్కువ లేదా తక్కువ భూమి ఉన్నట్లు తప్పుగా ఎంట్రీ కావడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నది.

దీని పరిష్కారానికి రైతులు తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. పాత రికార్డుల ప్రకారం సంబంధిత సర్వే నంబర్లో ఏ రైతుకు ఎంత భూమి ఉందనే వివరాలను తెలుసుకొని ఆర్ఎస్ఆర్ సమస్యను పరిష్కరించవచ్చు, కానీ, రికార్డుల్లోనూ తప్పుగా ఎంట్రీ కావడంతో పరిష్కారానికి నోచుకోవడం లేదు.

పశు పోషణా కష్టమాయె..

అందని బిల్లులు..ఆందోళనలో పాడి రైతులు

- రంగారెడ్డి జిల్లాలోని ప్రజల నుంచి పాలను సేకరిస్తున్న మదర్, విజయ డెయిరీలు
- కొంత కాలంగా సక్రమంగా చెల్లించని డబ్బులు
- అన్నదాతలకు రావాల్సిన బకాయిలు కోట్లాది రూపాయలు
- రోడ్డెక్కుతున్న పాల రైతులు
- ఇప్పటికే యాచారం, కడ్తాల్ మండలాల్లో రోడ్లపై పాలు పారబోసి వినూత్న నిరసన..

కడ్తాల్ : పాల బిల్లులు సక్రమంగా చెల్లించడంలేదని పాలను రోడ్డుపై పారబోస్తున్న రైతులు (ఫైల్)

పాల బిల్లుల కోసం అన్నదాతలు రోడ్డెక్కుతున్నారు. జిల్లాలో వేలాది మంది రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని పాడి పరిశ్రమను ఏర్పాటు చేశారు. అలాగే, కొంతమంది ఇండ్ల వద్దే ఆవులు, గేదెలను పెంచుకుంటూ పాలను ఆయా బూత్‌ల్లో పోసి జీవనోపాధి పొందుతున్నారు. కానీ, నెలల తరబడిగా పాలను సేకరిస్తున్న మదర్, విజయ డెయిరీలు బిల్లులను సక్రమంగా చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆవులు, గేదెల పోషణ కష్టంగా మారిందని, వాటికి దాణాను తీసుకురావాలన్నా ఆర్థిక ఇబ్బందులతో నతమతమవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-రంగారెడ్డి, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ)

జిల్లాలో ఉన్న పాల డెయిరీలు

జిల్లాలో మదర్ డెయిరీ, విజయ డెయిరీ, అమూల్, వల్లభ, హెరిటేజ్, తిరుమల, మస్కతి వంటివి రైతుల నుంచి పాలను సేకరిస్తున్నాయి. ఇందులో అత్యధికంగా మదర్, విజయ డెయిరీలు గ్రామాల్లో బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకుని మరీ రైతుల నుంచి పాలను సేకరిస్తున్నాయి. బిల్లులను 15 రోజులకోసారి చెల్లిస్తాయి. అయితే, ఇటీవల మదర్, విజయ డెయిరీలు సరైన లాభాల్లేక.. ఆర్థిక సంక్షోభంలో ఉండడంతో రైతులకు సకాలంలో బిల్లులను చెల్లించడంలేదు. మదర్ డెయిరీ ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల తదితర మండలాల్లో పాలను సేకరిస్తుండగా, విజయ డెయిరీ షాద్‌నగర్, కొందుర్గు, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడ వంటి మండలాల నుంచి పాలను సేకరిస్తున్నది.

కాగా, మదర్ డెయిరీ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. దాదాపుగా రూ. 1,00,00,000 నుంచి రూ. 1,50,00,000 బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. దీంతో రైతులకు పాల బిల్లులను సక్రమంగా చెల్లించలేకపోతున్నామని ఆ సంస్థ డైరెక్టర్ కూడా అంగీకరించారు. జనవరి నెల మొత్తం, ఫిబ్రవరి ఇప్పటివరకు రైతులకు బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన రైతులు తమకు రావాల్సిన సుమారు రూ.30 లక్షలు వెంటనే చెల్లించాలని తమ పాలను రోడ్డు పై పోసి ఇటీవల వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

మదర్, విజయ డెయిరీలు చెల్లించాల్సిన బకాయిలు రూ.కోట్లలోనే..

అదేవిధంగా, విజయ డెయిరీ కూడా రూ. 25 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. తమ డబ్బులను వెంటనే చెల్లించాలని అన్నదాతలు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిల గురించి ఎవరిని అడగాలో తెలియక కడ్తాల్ మండలానికి చెందిన రైతులు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నేతృత్వంలో రోడ్డుపై పాలను పారబోసి ఇటీవల నిరసన తెలిపారు.

పాల బిల్లులు చెల్లించాలి

పాల బిల్లులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. పాడి పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్న తనలాంటి ఎంతోమంది అన్నదాతలు మదర్, విజయ డెయిరీలకు ప్రతిరోజూ పాలను పోస్తున్నారు. అయితే ఆ రెండు సంస్థలు ప్రతినెలా సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పశుపోషణ కూడా కష్టంగా మారుతున్నది. కుటుంబం నడవడం ఇబ్బంది అవుతున్నది.

-వరప్రసాద్‌రెడ్డి, నజ్జక్‌సింగారం

సకాలంలో పాల బిల్లులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నా. ప్రతిరోజూ కడ్తాల్ గ్రామంలోని విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో 40 లీటర్ల పాలు పోస్తా. ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1.10 లక్షలు బాకీ ఉన్నది . కాంగ్రెస్ సర్కార్ వచ్చినప్పటి నుంచి పాల బిల్లులు సమయానికి చెల్లించడంలేదు. దీంతో ఆవులకు దాణా, మందులు, కుటుంబ ఖర్చులకు కష్టంగా మారింది.

బిల్లుల ఆలస్యంతో ఇబ్బందులు

-బాచిరెడ్డి-బాచిరెడ్డి అశోక్‌రెడ్డి, పాడి రైతు, కడ్తాల్

అన్నదాతకు అన్నీ అవస్థలే..

రైతును రాజుగా చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసింది. కానీ, అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఇబ్బందిపెడుతున్నది. సకాలంలో పెట్టుబడి సాయాన్ని అందించక.. ఎరువులు, విత్తనాలనూ అందుబాటు ఉంచక.. మరోవైపు రైతులకు అందాల్సిన బోనస్ డబ్బులనూ బ్యాంకు ఖాతాల్లో జమచేయక..పాడి పరిశ్రమనే నమ్ముకుని జీవిస్తున్న అన్నదాతలకు బిల్లులను చెల్లించక వారిని మనోవేదనకు గురిచేస్తున్నది.

కుటుంబాన్ని నడపడం కష్టంగా మారింది..

ఎన్నో ఏండ్లుగా పాడి పరిశ్రమనే నమ్ముకుని జీవిస్తున్నా. ప్రతిరోజూ విజయ డెయిరీలో వంద లీటర్లకుపైగా పాలు పోస్తా. రూ.2,20,000 పాల బిల్లు పెండింగ్‌లో ఉన్నది. సక్రమంగా డబ్బులు చెల్లించకపోవడంతో పశు పోషణతోపాటు, కుటుంబాన్ని నడపడం కష్టంగా మారింది. పిల్లల స్కూల్ ఫీజులు, ఇతర ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రేవంత్ సర్కార్ కంటే.. బీఆర్ఎస్ పాలనే నయం. అప్పుడు పాడి రైతులు రాజులాగా బతికారు.

కాకర్ల సత్యం, పాడి రైతు, కడ్తాల్

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్ నిర్వాహకులపై ఫుడ్ సేఫ్టీ అధికారుల చర్యల పరంపర కొనసాగుతున్నది. గురువారం నగరంలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. హైకోర్టు రోడ్డు సమీపంలోని మహాలక్ష్మి టిఫిన్ సెంటర్, భాటియా హోటల్ చిప్స్, హస్మత్ హాట్ చిప్స్, మర్వాడీ హాట్ చిప్స్, ఎంజీబీఎస్‌లోని శక్తి సాగర్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్, చాంద్రాయణగుట్టలోని సిద్ధి వినాయక ఎంటర్ ప్రైజెస్, జూబ్లీహిల్స్‌లోని ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్, కాప్రాలోని లక్ష్మిడెయిరీ ప్రొడక్షన్, బ్రూవర్స్ కెటిల్, ఎంఎస్ హాస్టల్, మారుతీ హాస్టళ్లలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల సమయంలో పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని లోపాలను గుర్తించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

శివార్లలో చెక్‌పోస్టులు

సిటీలోకి ఇసుక అక్రమంగా రాకుండా పటిష్ట నిఘా

'గాయం ఒక చోట.. మందు మరోచోట' కథనంపై చర్చ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి లారీల్లో హైదరాబాద్‌లోకి ఇసుక అక్రమంగా ఎలా వస్తుంది...? దీనికి సహకరిస్తున్న వారెవరు..? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇసుక రీచ్‌ల వద్దే కట్టడి చేస్తే సమస్య ఉండదని 'గాయం ఒక చోట.. మందు మరోచోట' అనే శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై పోలీసులు, వ్యాపార వర్గాల్లో జోరుగా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలంటూ పోలీసులకు సూచనలు చేయడంతో నగరంలోకి ఇసుక లారీలు ప్రవేశించకుండా ఉండేలా చర్యలు తీసుకునేందుకు పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఎక్కువగా గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక హైదరాబాద్‌కు సరఫరా అవుతున్నది. ఇక్కడ నకిలీ వే బిల్లులు పెట్టుకోవడం, ఒక చోటకు అనుమతి తీసుకొని మరో చోటకు తరలించడం, ఒకే వే బిల్లుతో పదుల సంఖ్యలో లారీలను తరలించడం వంటి జిమ్మిక్కులు చేస్తూ అక్రమార్కులు నగరానికి ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇలాంటి ఇసుకను కొందరు చిరు వ్యాపారులు తెలిసి, మరి కొందరు తెలియకుండా డంపింగ్ చేసుకుంటూ దానిని విడిగా చిన్న చిన్న నిర్మాణాలకు విక్రయిస్తున్నారు. ఇలాంటి వారిపై ఇప్పుడు ట్రై పోలీస్ కమిషనరేట్ల పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. వందల కిలోమీటర్ల దూరం నుంచి ఇసుక అక్రమంగా రవాణా అవుతుందంటే అటూ ఆర్టీఏ, స్థానిక పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ విభాగాల అధికారులు ఏమి చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. అక్రమార్కుల వెంట పలు కుబడి ఉన్న వారు ఉండడంతో ఆయా లారీలు ప్రయాణించే రూట్లలోని యంత్రాంగాన్ని తమకు అనుకూలంగా మార్చుకొని మమ్మాళ్లు ఇస్తూ నగరంలోకి తీసుకొస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇసుక అక్రమ రవాణా కాకుండా ఉండేలా నగర శివారుల్లో నిఘాను పటిష్టం చేయనున్నారు.

నిఘాను పటిష్టం చేస్తాం

ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను ఉక్కుపాదంతో అణచేయాలని ఆదేశాలిచ్చింది. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, కమిషనరేట్ల పోలీసులు, ఇతర అధికార యంత్రాంగం సమన్వయంతో ఈ అక్రమ దందాను నిలువరించేందుకు చర్యలు చేపట్టాం. అందులో భాగంగానే ఇటీవల అక్రమంగా ఇసుకను తీసుకొచ్చి డంపింగ్ చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. ఇసుక తక్కువ ధరకు నేరుగా ప్రజలకు అందేలా ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశం. దళారుల చేతుల్లో పడుతూ బ్లాక్‌మార్కెట్‌కు తరలకుండా కట్టడి చేయడంతోపాటు శివారుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ఇసుక అక్రమంగా హైదరాబాద్ నగరంలోకి వెళ్లకుండా ఉండేలా నిఘాను పటిష్ట చేస్తాం.

- సుధీర్‌బాబు, సీపీ, రాచకొండ

రద్దు మరిచి.. రాయితీలేంది?

ఎల్ ఆర్ఎస్‌పై కాంగ్రెస్ డబుల్ గేమ్

- పూర్తి స్థాయిలో రద్దు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీ
- తీరా గెలిచిన తర్వాత 25 శాతం రాయితీ అంటూ బుకాయింపు
- స్పష్టమైన విధి విధానాలు ప్రకటించకుండా సీఎం రేవంత్ రెడ్డి దోబూచులాట
- 7లక్షలకు పైగా ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ): 'అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తాం. పేద, మధ్య తరగతి వర్గాలకు ఉచితంగా లే అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరిస్తాం.' అంటూ ఆనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలను కాంగ్రెస్ మరిచింది. అనధికారిక లే అవుట్లు, జీపీ లే అవుట్లలో ప్లాట్లను కొనుగోలు చేసి ఇబ్బంది పడుతున్న ఎంతోమందికి ఊరటనివ్వాల్సిన ప్రభుత్వం... జేబుకు చిల్లుపెట్టేందుకు సిద్ధమైనది.

ఇచ్చిన హామీని పక్కన పెట్టి...ఫీజుల రూపంలో భారీ మొత్తంలో వసూలు చేయనున్నది. ఈ క్రమంలో హెచ్ఎండీఏతోపాటు, నగర శివారులో ఉన్న మున్సిపాలిటీ లు, కార్పొరేషన్ల పరిధిలో మొత్తంగా 7లక్షలకు పైగా ఉన్న పెండింగ్ దరఖాస్తులతో ఖజానా నింపుకొనే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. 2020 నుంచి కార్యాలయాల్లో మగ్గుతున్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మార్చి 31 గడువులోగా ఫీజులు చెల్లించుకోవాలని, 25 శాతం రాయితీనిస్తున్నామని ప్రకటించి మరింత గందరగోళానికి కారణమైనది. దీనికితోడు అస్పష్టమైన విధివిధానాలను ప్రకటించిందే తప్పా... లిఖితపూర్వకంగా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో గడిచిన ఐదారేండ్లుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండేందుకు ప్రధాన కారణాల్లో ఇరిగేషన్, రెవెన్యూతోపాటు అనుమతులిచ్చే మున్సిపల్ శాఖల మధ్య సమన్వయ లోపం కూడా ఉంది. దీంతోనే ఇప్పటికీ లక్షలాది దరఖాస్తులను ఎప్పటిలోగా ఎలా పరిష్కరిస్తారనేది ఇప్పుడొక అంతు చిక్కని ప్రశ్నగా మారిపోయింది.

మాట మార్చిన రేవంత్ రెడ్డి..

తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దు చేస్తామని, పేదోడిపై ఒక్క రూపాయా భారం మోపకుండానే ప్లాట్లను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇస్తూ అప్పటి టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి పలు సమావేశాల్లో ప్రకటించారు. కానీ, ఆయన సీఎం అయిన తర్వాత ఆ విషయాన్ని మరిచిపోయి... ఎల్ఆర్ఎస్‌పై 25శాతం రాయితీ పేరిట కాంగ్రెస్ మాట మార్చింది. దీంతో పేదోడిపై సగటున రూ. లక్షల భారం పడనున్నది. ఇప్పటికే కొనుగోలు చేసుకుని ఏండ్లుగా ఇబ్బందులు పడుతుంటే, తాజాగా ఎల్ఆర్ఎస్ పేరిట కాంగ్రెస్ తమ జేబులు ఖాళీ చేసేలా ఉందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. కనీసం విధి విధానాలు ప్రకటించకుండా మార్చి 31లోపు దరఖాస్తు ఫీజులు చెల్లించాలని ప్రకటించడం వెనుక ఖజానా నింపుకోవాలనే ఉద్దేశమే తప్పా.. సామాన్యులకు లబ్ధి చేయాలని ఏమి లేదని మండిపడుతున్నారు.

సుమారు 7 లక్షలకుపైగా..

హెచ్ఎండీఏతోపాటు, శివారులోని మున్సిపాలిటీల్లో దాదాపు 7లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తులను పలు దశల్లో పరిశీలించి క్రమబద్ధీకరించేలా గత ప్రభుత్వం విధివిధానాలు, ఫీజుల చెల్లింపులను ఖరారు చేసింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చేందుకు ఎల్ఆర్ఎస్ పేరిట కల్లబొల్లి మాటలు చెప్పిన రేవంత్‌రెడ్డి... అధికారంలోకి రాగానే... ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పేరిట పేదల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీనికోసం మార్చి 31 లోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను 25శాతం రాయితీతో పరిష్కరిస్తామని తాజాగా ప్రకటించడం ఇప్పుడు గందరగోళానికి కారణమైంది.

ఎల్ ఆర్ఎస్‌ను తీసుకొచ్చిందే కాంగ్రెస్

గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్నలే అవుట్లను అక్రమ ప్లాట్లుగా నిర్ధారిస్తూ, వాటిని క్రమబద్ధీకరించుకోవాలంటూ 2006లో తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్ఆర్ఎస్)ను ప్రవేశపెట్టింది. క్రమబద్ధీకరణ పేరిట ఖజానా నింపుకొనేందుకు అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం మొదట ఎల్ఆర్ఎస్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అప్పటివరకు సజావుగా నడిచిన జీపీ లే అవుట్ల రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతులతో స్థానిక సంస్థలకు కూడా ఆదాయం సమకూరింది. కానీ, ఉద్దేశపూర్వకంగా రాష్ట్ర ఖజానా నింపుకొనే కుట్రతో ఎల్ఆర్ఎస్ పేరిట సామాన్యుడిపై గుదిబండను కాంగ్రెస్ ప్రభుత్వం మోపింది. అయితే బీఆర్ఎస్ హయాంలోనూ ఎల్ఆర్ఎస్ నోటిఫికేషన్ జారీ చేసినా... క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులు, చార్జీలపై పలు రియల్ ఎస్టేట్ సంఘాల నుంచి వచ్చిన అభ్యంతరాలతో... ఎల్ఆర్ఎస్‌పై నిర్ణయం తీసుకోలేదు. కానీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీ మరిచి, ఎల్ఆర్ఎస్ పేరిట భారీ మొత్తంలో వసూలు చేసేందుకు కసరత్తు చేస్తున్నది.

అస్పష్టంగానే విధివిధానాలు..

హెచ్ఎండీఏ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించే క్రమంలో.. ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన విధివిధానాలు విడుదల కాలేదు. గత నిబంధనల ప్రకారమే ఫీజులు వసూలు చేస్తారా? లేక కొత్త మార్కెట్ విలువ ప్రకారం ఫీజులను నిర్ధారిస్తారా? అనేది ఇప్పటికీ గందరగోళంగానే ఉన్నది.

కానీ, ప్రభుత్వం 25శాతం రాయితీ అని చెప్పి.. ఖజానాను నింపుకొనే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. నిజానికి హెచ్ఎండీఏతోపాటు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని కార్పొరేషన్లు, మేడ్చల్ జిల్లా పరిధిలో నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు, ఈ రెండు జిల్లాల్లో కలిసి 23 మున్సిపాలిటీల్లో ఏకంగా 7-8లక్షల దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

- శివారులోని ఓ మున్సిపల్ అధికారి